క్లుప్తంగా

కలెక్టర్‌కు పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమ ఆహ్వానం



కలెక్టర్ వెట్రిసెల్వికి ఆహ్వాన పత్రం అందిస్తున్న విద్యార్థినులు

ఏలూరు(మెట్రో): వట్లూరు డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ గురుకులం పాఠశాలలో శనివారం ఉదయం నుంచి నిర్వహించే మెగా పేరెంట్స్ టీచర్స్ కార్యక్రమానికి కలెక్టర్ కె.వెట్రిసెల్విని సంబంధిత పాఠశాల విద్యార్థినులు, సిబ్బంది ఆహ్వానించారు. ఏలూరు కలెక్టరేట్లో శుక్రవారం కలెక్టర్‌ని కలిసి ఆహ్వాన పత్రం అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డి.మేరీ ఝాన్సీ రాణి, ఎంఈఓ డీపీ రమణ, ఉపాధ్యాయురాలు, బి.చైతన్య, విద్యార్థిని బి.సంధ్య ఉన్నారు.

ఉత్సాహంగా సాంస్కృతిక వారోత్సవాలు



మెహందీ అలంకరణలో విద్యార్థినులు

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : స్థానిక సీఆర్ఆర్ మహిళా కళాశాలలో సాంస్కృతిక వారోత్సవాలు ఉత్సాహభరిత వాతావరణంలో నిర్వహిస్తున్నారు. ఈ ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విద్యార్థినులకు మెహందీ, కేశ అలంకరణ, పద్య పఠనం, పాటల పోటీలు నిర్వహించారు. మెహందీ పోటీల్లో ఆర్ సౌమ్యశ్రీ ప్రథమ, ఎస్ కే సుల్తానా ద్వితీయ, ఎన్ మీనాక్షి తృతీయ, పి.తైనిక ప్రోత్సాహక, కేశాలంకరణ పోటీల్లో ఎస్ సింధూర, టి.మీనాక్షిత, ఎ.దుర్గ వరుసగా తొలి మూడు స్థానాల్లో నిలువగా కె.నాగ శిరీష ప్రోత్సాహక బహుమతులు సాధించారు. పద్య పఠనం పోటీల్లో సీహెచ్ శ్రావణి ప్రథమ, ఎస్ అనూష ద్వితీ, ఎస్ మానస తృతీయ స్థానాల్లో నిలిచారు. వీరికి, విజేతలుగా నిలిచిన వారికి కరస్పాండెంట్ విశ్వనాథరావు, ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ జి.సరళ శుభాకాంక్షలు తెలిపారు.

వైఎస్సార్ సీపీ హయాంలోనే మహర్దశ

- రూ.20 కోట్లతో కైకలూరు రోడ్డు నిర్మాణం
- ఏడాది పూర్తయిన సందర్భంగా ప్రజల హర్షం

ఏలూరు రూరల్ : కైకలూరు రోడ్డు నిర్మించి సరిగ్గా ఏడాదయ్యింది. సుమారు 50 ఏళ్ల నాటి ప్రమాదకర శ్రీపర్రు కాజ్‌వే వద్ద వంతెన సైతం వైఎస్సార్ సీపీ హయాంలోనే నిర్మించారు. నేడు ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్న ప్రజలు మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దక్షతను గుర్తు చేసుకుంటున్నారు. ఏలూరు, కైకలూరు ప్రజలు పయనించే రోడ్డు కోసం గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం రూ.20.72 కోట్లు ఖర్చు చేసింది.

నెరవేరిన చిరకాల కోరిక

కైకలూరు రోడ్డు, కాజ్‌వే వంతెన గ్రామీణ ప్రజల చిరకాల కోరిక. గతంలో టీడీపీ హయాంలో నాటి మంత్రి పీతల సుజాత సైతం రోడ్డు, వంతెన నిర్మిస్తానని ఇచ్చిన హామీ బుట్టదాఖలైంది. చిన్నపాటి వర్షానికి సైతం కైకలూరు రోడ్డు ముంపుబారిన పడేది. ఫలితంగా ఎక్కడ పడితే అక్కడ గోతులు దర్శనమిచ్చేవి. ప్రజలు రోడ్డుపై ప్రయాణించలేదని దుస్థితి ఉండేది. శ్రీపర్రు కాజ్‌వే నీట మునిగిన సమయంలో కైకలూరు, ఏలూరుకు రాకపోకలు నిలిచిపోయేవి. రాత్రి వేళల్లో కాజ్‌వే కనిపించకపోవడంతో పలు వాహనాలు ఏటిలో పడి ప్రయాణికులు మృత్యువాత పడ్డ ఘటనలు ఉన్నాయి. అయినప్పటికీ నాటి పాలకులు పట్టించుకోలేదు. 2023లో వైఎస్సార్ సీపీ ప్రభుత్వం ప్రజల చిరకాల కోరికను నెరవేర్చింది. ఈ రోడ్డు అభివృద్ధికి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.20.72 కోట్లు మంజూరు చేసింది. నాటి ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కృషి ఇందుకు తోడైంది. పనులకు వర్షాలు, వరదలు అడ్డంకులు సృష్టించినా అధికారులు, కాంట్రాక్టర్ కలిసి రోడ్డు నిర్మాణాన్ని పూర్తిచేశారు. శ్రీపర్రు, మాదేపల్లి గ్రామాల ప్రజల కోరిక మేరకు గ్రామ పరిసరాల్లో రోడ్డును సీసీ రోడ్డుగా అభివృద్ధి చేశారు. భవిష్యత్తులో రోడ్డు కోతకు గురికాకుండా రివెంట్‌మెంట్ సైతం నిర్మించారు. రోడ్డు మధ్య నుంచి నీటి పారుదలకు కల్వర్టులు కట్టారు. ఇదే సమయంలో కొల్లేరు గ్రామాల ప్రజల కోరిక మేరకు సుమారు రూ.80 లక్షలు ఖర్చు చేసి ఏలూరు నుంచి చాటపర్రు, కోటేశ్వరదుర్గాపురం, పైడిచింతపాడు, గుడివాకలంక, ప్రత్తికోళ్లలంక గ్రామాల మీదగా అధికారులు రెండు రోడ్లను నిర్మించారు.





వైఎస్సార్ సీపీ హయాంలో నిర్మిస్తున్న కైకలూరు రోడ్డు (ఫైల్), నాడు రోడ్డు పనుల పరిశీలనకు వచ్చిన ఆర్అండ్‌బీ అధికారులతో అబ్బయ్య చౌదరి

నాటి ప్రభుత్వ నిబద్ధతకు నిదర్శనం



కైకలూరు రోడ్డు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం నిబద్ధతకు నిదర్శనం. నేటి ప్రభుత్వం ఇలాంటి అభివృద్ధి చేసి చూపాలి. మాదేపల్లి, శ్రీపర్రు గ్రామాల వద్ద సీసీ రోడ్డు నిర్మించడం వల్ల మరో 25 ఏళ్ల వరకు రోడ్డు గోతులు పడదు. మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్య చౌదరి కృషి కారణంగా నాడు జగన్ ప్రభుత్వం నిధులు విడుదల చేసింది. ప్రజల కోరిక మేరకు మాజీ ఎమ్మెల్యే ప్రత్యేక చొరవ తీసుకుని రోడ్డు పూర్తి చేయించారు.

– పల్లెం ప్రసాద్, పైడిచింతపాడు

కొల్లేరు రోడ్డు అభివృద్ధి



వైఎస్సార్ సీపీ ప్రభుత్వం కొల్లేరు రోడ్డు అభివృద్ధికి ఎంతో కృషి చేసింది. కోట్ల రూపాయలు ఖర్చు చేసింది. నేటి అధికార పక్షం నాయకులు, నాడు ప్రతి పక్షంలో ఉండి ఎన్నో ఆటంకాలు సృష్టించారు. అయినప్పటికీ వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సహకారంలో మాజీ ఎమ్మెల్యే కొఠారు అబ్బయ్యచౌదరి పని పూర్తి చేశారు. నేడు ఈ రోడ్డుపై వందల మంది ఎలాంటి కుదుపులు లేకుండా హ్యాపీగా ప్రయాణం చేస్తున్నారు.

– ముంగర సంజీవ్‌కుమార్, పైడిచింతపాడు

మగ ఆరోగ్య కార్యకర్తలకు న్యాయం చేయాలి

ఏలూరు (టూటౌన్): వైద్య ఆరోగ్య శాఖ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో నియమించిన మగ ఆరోగ్య కార్యకర్తలను తొలగించాలనే నిర్ణయాన్ని వెంటనే నిలిపివేయాలని యునైటెడ్ మెడికల్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ (సీఐటీయూ) ఏలూరు జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. ఈ మేరకు యూనియన్ గౌరవాధ్యక్షుడు డీఎస్‌వీడీ ప్రసాద్, యూనియన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు జీవీ రమణ, సయ్యద్ జఫ్రుల్లా, డి.వేణుగోపాల్, ఎం బాలరాజులు శుక్రవారం ఒక సంయుక్త ప్రకటన విడుదల చేశారు. ఉమ్మడి జిల్లాలో సుమారు 15 మంది 20 సంవత్సరాల నుంచి విధులు నిర్వహిస్తున్నారని, కరోనా సమయంలో ప్రాణాలకు సైతం తెగించి పనిచేశారని వివరించారు. ఇటీవల తెలంగాణ హైకోర్టు ఆదేశాల మేరకు ఆంధ్రప్రదేశ్ వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు మగ ఆరోగ్య కార్యకర్తలను తొలగించాలని ఆదేశాలు ఇచ్చారని తెలిపారు. మగ ఆరోగ్య కార్యకర్తలను తొలగించకుండా ముఖ్యమంత్రి, వైద్య ఆరోగ్య శాఖామత్యులు, వైద్య ఆరోగ్యశాఖ ఉన్నతాధికారులు తగిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

సక్కు కుమారికి సత్కారం

ఏలూరు (టూటౌన్): ఏలూరు జిల్లా యాదవ సంఘం అధ్యక్షుడు ముమ్మడి చింతయ్య సతీమణి సక్కు కుమారి సౌత్ సెంట్రల్ రైల్వే బోర్డు (డీఆర్‌యూసీసీ, విజయవాడ డివిజన్) సభ్యురాలిగా నియమితులైన సందర్భంగా సంఘ నాయకులు ఆమెను, చింతయ్యను శుక్రవారం సత్కరించారు. వట్లూరులోని వారి నివాసంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో సంఘ నేతలు సీహెచ్ శ్రీనివాసరావు, ఉక్కు సూరి గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కరెన్సీపై అంబేడ్కర్ ఫొటో ముద్రించాలి

ఏలూరు(మెట్రో) : ఆర్‌బీఐ సృష్టికర్త డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఫొటోను కరెన్సీ నోటుపై ముద్రించాలని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం జాతీయ ప్రధాన కార్యదర్శి మేడం సంతోష్ కుమార్, రాజ్యాంగ ధర్మ పరిషత్ వ్యవస్థాపకుడు, ప్రొఫెసర్ ఎస్ఏడీ పాల్ కోరారు. అంబేడ్కర్ 68వ వర్ధంతి సందర్భంగా రాజ్యాంగం తెలుగు అనువాద పుస్తకాన్ని జిల్లా కలెక్టర్ కె. వెట్రి సెల్వికి శుక్రవారం కలెక్టరేట్‌లోని ఆమె చాంబర్‌లో అందజేశారు. దేశంలో ప్రతి రంగంలోనూ ప్రజలకు సమానమైన హక్కు కల్పించిన స్త్రీ జాతి విమోచకుడు అంబేడ్కర్ అని వారు గుర్తుచేశారు. విద్యా సంస్థల్లో రాజ్యాంగ పీఠికను చదివిస్తూ, ఆర్టికల్స్‌ను విద్యార్థులకు తెలియజేయాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. కార్యక్రమంలో పులవర్తి డేవిడ్, బొద్దుల వేణు, న్యాయవాది వెంకయ్య పాల్గొన్నారు. తొలుత స్థానిక నరసింహారావుపేటలోని ఆల్ ఇండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు.



కలెక్టర్ వెట్రిసెల్వికి రాజ్యాంగం తెలుగు అనువాద పుస్తకాన్ని అందిస్తున్న నాయకులు

జిల్లా పరిషత్ కార్యాలయంలో..

బీఆర్ అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా జిల్లా పరిషత్ కార్యాలయంలో అంబేడ్క విగ్రహానికి జెడ్పీ చైర్‌పర్సన్ ఘంటా పద్మశ్రీ ప్రసాద్ పూలమాల వేసి నివాళులర్పించారు. బాబాసాహెబ్ అంబేడ్కర్ సేవలను కొనియాడారు. జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వాహణ అధికారి ఆర్ విజయరాజు, ఉప ముఖ్యకార్యనిర్వాహణ అధికారి కె.భీమేశ్వర్, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

అంబేడ్కర్ ఆశయాలు స్ఫూర్తిదాయకం

- వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ సమన్వయ కర్త మామిళ్లపల్లి జయప్రకాష్
- అంబేడ్కర్ చిత్రపటాలు, విగ్రహాల వద్ద ఘన నివాళులు



వైఎస్సార్ సీపీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సమన్వయకర్త జయప్రకాష్

ఏలూరు టౌన్ : భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ ఆశయాలు స్ఫూర్తిదాయకమని వైఎస్సార్ సీపీ ఏలూరు నియోజకవర్గ సమన్వయ కర్త మామిళ్లపల్లి జయప్రకాష్ అన్నారు. అంబేడ్కర్ 67వ వర్ధంతి సందర్భంగా పార్టీ ఏలూరు జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ చిత్రపటానికి జయప్రకాష్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత బలహీన వర్గాలకు సమాజంలో గుర్తింపు, గౌరవం లభించేలా అంబేడ్కర్ చేసిన కృషి మరువలేనిదన్నారు. అంబేడ్కర్ ఆశయాలను ఆచరణలో పెడుతూ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సమాజంలో పేద, మధ్యతరగతి బలహీన వర్గాల సంక్షేమానికి కృషి చేశారని గుర్తుచేశారు. పేదల అభ్యున్నతి విద్యతోనే సాధ్యమనే ఆలోచనతో ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేశారని వివరించారు. నేడు సీఎం చంద్రబాబు పేదల జీవితాల్లో చీకట్లు నింపుతున్నారని ఆరోపించారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకుండా, అధిక ధరలతో ప్రజలను ఇబ్బందులకు గురిచేస్తున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఏలూరు మాజీ డిప్యూటీ మేయర్లు గుడిదేశి శ్రీనివాసరావు, నూకపెయ్యి సుధీర్‌బాబు, పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి మున్నుల జాన్‌గురునాథ్, పార్టీ బీసీ సెల్ రాష్ట్ర కార్యదర్శి కిలాడి దుర్గారావు, పార్టీ నాయకులు ఇనపనూరి జగదీష్, జీ ఎం ఆర్, మాజీ ఏఎంసీ డైరెక్టర్ మేతర సురేష్, జేసీఎస్ కన్వీనర్ వైఎస్‌పీ శివరావు, మాజీ హిస్టరీ అకాడమీ డైరెక్టర్ ఎండీ కై సర్, జిల్లా నాయకులు పల్లి శ్రీనివాస్, స్టాలిన్, తులసీ, బత్తిన మస్తాన్ రావు, తులసీ వర్మ, ఇందిరా, మట్టా రాజు, వీరవల్లి లక్ష్మి కుమార్, జనార్ధన్, ఫణి, సొంగ మధు, గాజుల బాజీ, వెంకీ, డేనియల్, అనిల్, చిన్నీ తదితరులు ఉన్నారు.

బీఆర్ అంబేడ్కర్‌కు ఘన నివాళి

ఏలూరు (టూటౌన్): భారత రాజ్యాంగ నిర్మాత అంబేడ్కర్ వర్ధంతి సందర్భంగా ఆయనకు పలు సంఘాలు, నాయకులు ఘనంగా నివాళులర్పించారు. ఎస్సీ, ఎస్టీ బహుజన రైట్స్ ప్రొటెక్షన్ సొసైటీ కార్యాలయంలో అంబేడ్కర్ చిత్ర పటం వద్ద ఘన నివాళి అర్పించారు. మేతర అజయ్ బాబు, కలతోటి డోమినిక్,మేతర అశోక్ కుమార్, మాధవరావు, వినుకొండ రామయ్య, బుద్దుల వేణు, బీటీఏ టీచర్ అసోసియేషన్ గౌరవ అధ్యక్షుడు శ్రీనివాస్ పాల్గొన్నారు.

- అశోక్ నగర్‌లోని బీజేపీ జిల్లా కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. ఆయన జీవిత విశేషాలను బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గారపాటి చౌదరి వివరించారు. జిల్లా అధ్యక్షుడు సీచ్ విక్రమ్ కిషోర్, జిల్లా ప్రధాన కార్యదర్శి నడపన దాన భాస్కర్, గాది రాంబాబు, నాగం శివ, మద్ది శాస్త్రి, రామకృష్ణ, బర్మా లక్ష్మణరావు, జ్యోతి కుమార్, ఇలపకుర్తి కుసుమ పాల్గొన్నారు.
- కోటదిబ్బలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీ ఆవరణలోని అంబేడ్కర్ విగ్రహానికి ఎస్సీ, ఎస్టీ కుల సంఘాల జేఏసీ ఆధ్వర్యంలో పూలమాలలు వేసి నివాళుల అర్పించారు. బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీలంతా ఐకమత్యంగా రాజ్యాధికారం సాధించినప్పుడే అంబేడ్కర్‌కు నిజమైన నివాళి అని నాయకులు పేర్కొన్నారు. అంబేడ్కర్ జీవిత చరిత్రను, రాజ్యాంగాన్ని పాఠ్యాంశంగా చేర్చాలని, భారత కరెన్సీపై ఆయన ఫొటో ముద్రించాలని కోరారు. మాల కార్పొరేషన్ డైరెక్టర్ దాసరి ఆంజనేయులు, మాజీ డిప్యూటీ మేయర్ నూకపెయ్యి సుధీర్, పల్లెం ప్రసాద్, ప్రొఫెసర్ ఎస్ఏడీ పాల్, మెండెం సంతోష్ కుమార్, నేతల రమేష్ బాబు, దాసరి నాగేంద్ర కుమార్, పాము సామ్యూల్, మెండెం ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.
- ఏలూరు బార్ అసోసియేషన్ వద్ద బార్ అధ్యక్షుడు కోనే సీతారామ్ అధ్యక్షతన అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అంబేడ్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఎస్సీ, ఎస్టీ న్యాయవాదుల అసోసియేషన్ అధ్యక్షుడు పి.రత్నరాజు, ప్రధాన కార్యదర్శి జి.తిరుపతి స్వామి, మాజీ అధ్యక్షుడు కె.రాజబాబు తదితరులు పాల్గొన్నారు.
- సమానత్వాన్ని నెలకొల్పడంలో అంబేడ్కర్ కీలక పాత్ర పోషించారని హెచ్ఎం బేతాళ సుదర్శనం అన్నారు. శ్రీరామ్ నగర్‌లోని ఎంపీయూపీ స్కూల్లో అంబేడ్కర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఉపాధ్యాయులు మాచర్ల రాజేశ్వరి, పులిపాటి గోర్లీ, విద్యార్థులు పాల్గొన్నారు.
- ప్రపంచం గర్వించే వ్యక్తి అంబేడ్కర్ అని జాతీయ దళిత నేత పాలిమేర హరికృష్ణ కొనియాడారు. పాతబస్టాండ్ సెంటర్‌లోని అంబేడ్కర్ విగ్రహానికి ఆయన పూలమాల వేసి నివాళులర్పించారు. మాజీ కౌన్సిలర్ జోగి నరేంద్ర కుమార్, ఎస్సీ నాయకులు విప్పర్తి ప్రసాద్, చర్మకారుల నాయకులు పులసల మధు, పాలిమెట్ల సురేష్, యు.సురేష్, మందపాటి శ్రీనివాస్, చింతాటి వెంకీ తదితరులు పాల్గొన్నారు.
- ఆర్ఆర్‌పేటలోని దళిత సేన రాష్ట్ర కార్యాలయంలో అంబేడ్కర్ వర్ధంతి కార్యక్రమం నిర్వహించారు. రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ప్రతి ఒక్కరూ సైనికుల్లా పనిచేయాలని సంఘం వ్యవస్థాపక అధ్యక్షులు జిజ్జువరపు రవిప్రకాష్ పిలుపు నిచ్చారు. జిల్లా అధ్యక్షుడు సిఖాకొల్లు స్టాలిన్, జిల్లా మహిళా అధ్యక్షురాలు బేతాళ జయసుధ, కొప్పుల నాగేంధర్, ముప్పిడి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





పాత బస్టాండ్ సెంటర్‌లోని కాంస్య విగ్రహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు, ఎస్సీ, ఎస్టీ బహుజన ప్రొటెక్షన్ రైట్స్ సొసైటీ కార్యాలయంలో నివాళి

వైభవంగా ఇరుముడి మహోత్సవం

ఏలూరు (ఆర్ఆర్‌పేట): స్థానిక 42వ డివిజన్ శ్రీ కళ్యాణ వేంకటేశ్వర స్వామి ఆలయ ప్రాంగణంలో శుక్రవారం ఆలయ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అయ్యప్పల సామూహిక ఇరుముడి మహోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. అనంతరం స్వాములందరూ పాత నీళ్ల ట్యాంకు ఆవరణలో భిక్ష చేసి, శబరిమల యాత్రకు బయలుదేరారు. కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బడేటి చంటి పాల్గొని మాట్లాడారు. త్రిపర్ణ రమణ, జంపా సూర్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్ఈఎల్ (ఇంద్ర)	21.00	26
ఏలూరు -బీహెచ్ఈఎల్ (అమరావతి)	22.00	40
ఏలూరు - బీహెచ్ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	16
ఏలూరు - తిరుపతి(ఇంద్ర)	19.00	36

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.45	4820	25
ఏలూరు - బీహెచ్ఈఎల్	21.15	4822	28
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా కే.కోట	19.30	4796	20
ఏలూరు -బీహెచ్ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	26
ఏలూరు-జీడిమెట్ల వయా ఖమ్మం	20.15	4802	25
ఏలూరు-బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	20.30	4800	30
ఏలూరు - బీహెచ్ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	31
ఏలూరు - ఈసీఐఎల్	22.30	4814	23
ఏలూరు - తిరుపతి	16.00	4830	34

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	40	అరటి కాయ (1)	07-10
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	60
వంకాయలు (కాంతులు)	30	చామదుంపలు	44
వంకాయలు (తెలుపు)	40	ములక్కాడలు	07, 10
బెండకాయలు	24	కంద	68
పచ్చిమిర్చి	26	బీట్‌రూట్	60
కాకర కాయలు	28-36	కీరా దోస	36
బీరకాయలు	36	ఫ్రెంచ్‌బీన్స్	68
బీరకాయలు (పందిరి)	48	అల్లం	70
క్యాబేజీ	36	కొత్తిమీర (కట్ట)	20
క్యారెట్	60	పాలకూర	10
దొండకాయలు	28	చుక్కకూర	10
బంగాళదుంపలు	38	తోటకూర	10
ఉల్లిపాయలు	36-58	గోంగూర	07
గోరుచిక్కుడు	30	పుదీనా	05
దోసకాయలు	20	బఠాణి	--
ఆనపకాయ (1)	20-25	క్యాప్సికమ్	66
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40


లీడర్‌షిప్ శిక్షణ జిల్లా కేంద్రంలోనే ఇవ్వాలి

ఏలూరు (ఆర్ఆర్‌పేట): ఉపాధ్యాయ సంఘాలతో నిర్వహించిన చర్చలో ఒప్పుకున్న విధంగా లీడర్‌షిప్ శిక్షణను జిల్లా కేంద్రాల్లోనే ఇవ్వాలని ఆంధ్రప్రదేశ్ టీచర్స్ ఫెడరేషన్ రాష్ట్ర కార్యదర్శి బీఏ సాల్మన్ రాజు, జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు టి.రామారావు, బి.రెడ్డిదొర ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. రాష్ట్ర సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నిర్వహించే లీడర్‌షిప్ శిక్షణలో పాల్గొన్న ఇద్దరు ప్రధానోపాధ్యాయులు శిక్షణ కేంద్రాల్లోనే మరణించారని, దీంతో ఈ లీడర్‌షిప్ శిక్షణ కార్యక్రమాన్ని నాన్ రెసిడెన్షియల్ విధానంలో జిల్లా కేంద్రాలలో నిర్వహించాలని పలుమార్లు విన్నవించామని తెలిపారు. అయినప్పటికీ ఈ నెల 9వ తేదీ నుంచి మొదలయ్యే నాలుగో విడత శిక్షణ జిల్లా కేంద్రాల్లో కాకుండా తిరిగి అదే మారుమూల ప్రాంతంలో నిర్వహించడం సరికాదని పేర్కొన్నారు. శిక్షణ కేంద్రం సుదూర ప్రాంతంలో ఉండడం వల్ల రోజూ వెళ్లి రావడానికి అనుకూలం కాదని, దీనిపై అధికారులు పునరాలోచించి జిల్లా కేంద్రంలోనే శిక్షణ కార్యక్రమాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

వ్యాయామ విద్యార్థుల ప్రతిభ

దెందులూరు: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం మహిళల బాస్కెట్‌బాల్ పోటీల్లో గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్య కళాశాల విద్యార్థులు ద్వితీయ స్థానం సాధించారు. ఏలూరు సెయింట్ ఆన్స్ కళాశాలలో గురువారం జరిగిన పోటీల్లో తమ విద్యార్థులు అత్యుత్తమ ప్రతిభ కనబరిచడం సంతోషంగా ఉందని ప్రిన్సిపాల్ ఎస్ నత్తానియేలు అన్నారు. శుక్రవారం గోపన్నపాలెం ప్రభుత్వ వ్యాయామ విద్యా కళాశాలలో విజేతలను ప్రిన్సిపాల్, లెక్చరర్లు దిలీప్ కుమార్, రతన్ బాబు, సిబ్బంది అభినందించారు.

ఆత్మీయ కలయిక



జగన్‌ను కలిసిన దెందులూరు నాయకులు

దెందులూరు: మాజీ సీఎం, వైఎస్సార్ సీపీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని శుక్రవారం తాడేపల్లిలోని ఆయన నివాసంలో పార్టీ దెందులూరు మండలం అధ్యక్షుడు కామిరెడ్డి నాని, మండల వైస్ ఎంపీపీ వేమూరి జితేంద్ర కుమార్ కలిశారు. మండలంలో నెలకొన్న పరిస్థితులు, పార్టీ శ్రేణులు పడుతున్న ఇబ్బందులను అధినేత దృష్టికి తీసుకెళ్లారు. కొంత కాలం ఓపిక పట్టాలని అధినేత జగన్ సూచించారని నాయకులు తెలిపారు.

అభయ యాప్‌తో నేరగాళ్ల అదుపు



కార్యక్రమంలో మాట్లాడుతున్న ఎస్సై నాగ కళ్యాణి

ఏలూరు (ఆర్ఆర్‌పేట) : నేటి సమాజంలో విచక్షణ లేకుండా నేరాలు చేస్తోన్న నేరగాళ్లను అదుపులోకి తీసుకు రావాలన్న ముఖ్య ఉద్దేశంతో అభయ మహిళా భద్రత యాప్‌ను ఎస్పీ ప్రతాప్ శివ కిషోర్ ప్రవేశపెట్టారని ఏలూరు 2 టౌన్ పోలీస్ స్టేషన్ ఎస్సై నాగ కళ్యాణి అన్నారు. డీఎస్పీ డి.శ్రావణ్ కుమార్ ఆదేశాల మేరకు ఏలూరు 2 టౌన్ ఇన్‌స్పెక్టర్ వైవీ రమణ ఆధ్వర్యంలో శుక్రవారం స్థానిక ఎస్‌పీడీబీటీ కళాశాలలో విద్యార్థినులకు అభయ.. మహిళల భద్రత అనే అంశాలపై అవగాహన కల్పించారు. ఎస్సై నాగ కళ్యాణి మాట్లాడుతూ ఎవరైనా ఆపద సమయంలో వెంటనే డయల్ 112కు ఫోనులో సమాచారం అందించిన పది నిమిషాల్లో పోలీసులు భద్రత కల్పిస్తారని తెలిపారు. బాల్యవివాహాలపై 1098కు సమాచారం అందించాలని కోరారు. సైబర్ నేరాలకు గురైతే వెంటనే 1930కి సమాచారం ఇస్తే సహాయ సహకారాలు అందిస్తామని చెప్పారు. అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు ఎస్పీ ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన వాట్సాప్ నెంబర్ 9550351100కు సమాచారం అందించాలన్నారు. సమాజంలో జరిగే అన్యాయాలను అరికట్టేందుకు ప్రతి ఒక్కరూ తమ వంతు సహకారం పోలీసులకు అందజేయాలని కోరారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ఏలూరు
90102 23729
95055 08399
79955 66352
Office mail : tpgadvt@gmail.com